

# వెలిసింది

రమానరసింహం కాశీవఝ్ఝల

తెప్పలా చంద్రబింబం తేలిపోతోంది నింగిలో.

ఆరబోసిన వెన్నెలలో చెట్లనీడలు చెంగు చెంగున చెమ్మచెక్కలు ఆడుకుంటున్నాయి.

మబ్బుదొన్నెల సుధను త్రాగి, ప్రేమికులు ఒడలు మరచే వేళ అది. పండు వెన్నెలను చూసి, అణచుకొన్నా గాని అణగని అస్పష్ట భావాలు పాటల్లై, ఎద లోపలి ఎదను పులకరింపజేసే వేళ అది.

సరిగ్గా ఆ వేళకి -

వెన్నెలచాయ చీర కట్టుకుని, వెన్నెట్లో మెరిసిపోతూ, విరగబూసిన జాజిమల్లెలని ఇంతలేసి కళ్ళతో అబ్బురంగా చూస్తోంది ఆ అమ్మాయి.

ఏపుగా ఎదిగిన మందార చెట్టు మాటున నిలబడిన అతడిని ఆ అమ్మాయి చూడలేదు.

ఆ అమ్మాయి కళ్ళు ఆకాశపు పుష్పాల్లా కాంతితో కళకళలాడుతున్నాయి.

పూలసౌరభాన్ని మోస్తున్న పిల్ల తెమ్మెరలు పరిసరాలని మత్తెక్కిస్తున్నాయి. ఆ మత్తులో ఆమె కళ్ళు అరమోడ్పులయ్యాయి. ఆ పూలనలా ఎంతోసేపు చూడలేకపోయింది. చూస్తూ ఊరుకోక వాటిని కోమలంగా తాకి, పరవశించింది. తనకోసమే వికసించాయి అనుకుంది కాబోలు, చేతులు ముందుకు సారించింది. మరో క్షణానికి పూసిన పూలు ఆమె కొంగున చేరాయి.

ఎదరకు రాకుండానే "ఎవరా పువ్వులు కోసేది?" అని కసిరినట్లుగా అడిగాడు అతడు.

ఆ గొంతు ఆనవాలు పట్టి కంగారుపడింది. బదులు చెప్పకముందే... అతగాడు ఎదుటికొచ్చాడు.

"మీ... మీ... మీరు?"

ఆ అమ్మాయి కొంచెం తటపటాయించి, "నే...ను" అంది.

ఆ అబ్బాయి చిరునవ్వు నవ్వాడు.

"పువ్వులు కోస్తున్నా" అంది పట్టుబడిన దొంగలా.

నవ్వుతూ... ఆమెవంక చూస్తూనే "కనికరించి మొగ్గల్నొదిలేసారు..." అని తనలో తాను నవ్వుకున్నాడు అతడు.

ఆ అమ్మాయి అమాయకంగా నవ్వుతూ, కొంగులోని పూలని దోసిట్లోకి తీసుకుని "మీరు తీసేసుకోండి" అంటూ అతడి ముందు దోసిలి పట్టింది.

అమెని అనుకరిస్తూ "ఇవి మీరు తీసుకోండి" అంటూ కొంటెగా నవ్వాడు.

"ఏమో... మాటలు రావనుకున్నానే" అంటూ గడుసుగా నవ్వింది ఆ అమ్మాయి.

పౌరుషంతో అతడి ముక్కుపుటాలు అదిరాయి. మండే నాడులలో అగ్నికీలలు ఉద్భవించాయి.

అంతే -

ఒక్క ఉదుటున ఆ అమ్మాయిని సందిట బంధించాడు. 'వద్దు' అన్న ఆమె పెదవులని సత్కరించాడు.

"ఛీ... ఛీ... ఏం పని" అని ఛీత్కరిస్తూ కౌగిలి విడిపించుకుంది ఆ అమ్మాయి.

మరో నిమిషానికి -

రోషంతో, అభిమానంతో అతడి చెంప ఫెడేల్మనిపించింది.

* * *

కరిమింగిన వెలగపండులా కాలచక్రం మరో ఇరవై ఏళ్ళని మింగేసింది.

ఆ రోజు -

ఊరింకా సద్దుమణగలేదు.

ముసలిదాని చత్వారపు నేత్రాల్లా వీధి దీపాలు మసక మసగ్గా వెలుగుతున్నాయి. లాంతరు స్తంభానికి ఎదురుగా వున్న ఆ పాత పెంకుటిల్లు ముందు కూడా ఆ వెలుగు కాస్తో కూస్తో పరచుకోవడానికి

ఉబలాటపడుతోంది.

ఆ సన్నపాటి వెలుగులో -

"నాన్న ఎప్పుడొస్తాడే అక్కా?" వాడీ ప్రశ్న ఇప్పటికి ఎన్నిసార్లు వేసుంటాడో. లెక్కేసే ఓపిక ఆ పదమూడేళ్ళ పిల్లలో సన్నగిల్లుతోంది. అయినా "వస్తార్లే" అంది విసుగుని అణుచుకుంటూ.

"వస్తార్లే అంటే కాదు. ఎప్పుడొస్తారో చెప్పాలి."

"ఎప్పుడంటే, నువ్వు - "

"ఊ నేను - "

"చప్పున అన్నం తింటే వెంటనే నాన్నొచ్చేస్తారు."

"తింటున్నానుగా - "

"తింటున్నానుగా అంటే కాదు. గబగబా తినేసెయ్యాలి" అంటూ సన్నగా నవ్వింది. ఆ పిల్ల అలా ఎప్పుడూ నవ్వుతూ వుంటుంది. అవును మరి, ఇంటికి పెద్ద పిల్ల. తనకు కోపం రాకూడదు. ఓర్పుగా ఉండాలి. వాళ్ళ నాన్న చెప్పాడా మాట. ఆ పాపకి వాళ్ళ నాన్న మాట వేదం. అప్పటి నుంచీ - ఆ అడపడుచుకి కోపం రాదు. తప్పే జారీ వచ్చినా నవ్వేస్తూ వుంటుంది.

ఆ కబురూ ఈ కబురూ చెబుతూ అన్నం పెట్టబోయిన తన చేతిని విసురుగా తోసేస్తూ "నే తినను ఫో" అంటూ బుంగమూతి పెట్టిన తమ్ముడిని, దగ్గరకు తీసుకుని ప్రేమగా తల నిమిరింది. బుగ్గలు పుణికింది.

ముడుచుకున్న తమ్ముడి పెదాలు విచ్చుకుంటున్నాయి.

"దా మరి, అన్నం తిను."

"చాక్లెట్లు" అన్నాడు తమ్ముడు.

"నాన్న తెస్తార్లే" అంది అక్క.

"అక్కా... మరి... క్లాసు పిల్లలకి రెండేసి చాక్లెట్లివ్వనా... లేకపోతే ఒకటీ ఇస్తే సరిపోతుందా" సలహా అడిగాడు అక్కగారిని.

"ఒకటిస్తే సరి" అంది అక్క తమ్ముడి మనసు చదివినదానిలా.

"రేపు నాకు ఎన్నో ఏడొస్తుందే" ప్రశ్నించిన తమ్ముడి మొహం ముందు ఏడువేళ్లు ఆడిస్తూ "ఏడేళ్లు" అంటూ చక్కలిగింతలు పెట్టింది.

అక్కా తమ్ముడూ కిలకిల్లాడారు.

తమ్ముడి కోపం చెట్టెక్కేసింది.

ఖాళీ కంచం అంటుగిన్నెలతో జతకట్టింది.

పిల్లలిద్దరూ నిద్రకళ్లేసారు.

"పడుకొండర్రా. నాన్నొస్తే నేలేపుతాన్లే" అన్న తల్లి మాటతో మంచాలెక్కేసారు.

అప్పుడు వచ్చాడాయన ఉసూరుమంటూ.

"ఇంత పొద్దోయిందేం?" అంటూ ముసి ముసిగా నవ్వుతూ మంచినీళ్ల గ్లాసందించింది.

భుజాన వేళ్లాడుతున్న సంచిని కిందబెట్టి, కుర్చీలో కూర్చుంటూ "ఏం... తెలీనట్లడుగుతున్నావ్?" ఆయన పెదవులు నీరసంగా కదిలాయి.

"భలేవారే" అని నొచ్చుకుంది భార్య.

"మెలకువగా వుండి వుంటే మీ పుట్టిన్రోజు పెళ్లికొడుకు వేసుండేవాడీ ప్రశ్న" అంటూ ముక్తాయించింది.

ఆ మాటతో ఆయనలో నీరసం పలాయనం చిత్తగించింది. కింద పెట్టిన సంచిలోంచి ఓ పేకెట్టు తీసి భార్య చేతిలో వుంచాడాయన పట్టలేని ఉత్సాహంతో.

ఆ పేకెట్టుని వంటింట్లో భద్రపరచి, చేత్తో ఉత్తరంతో ఆయన దగ్గరికి తిరిగొచ్చింది.

"ఇదిగో ఉత్తరం" అంటూ ఆయన చేతికిచ్చింది.

"ఎవరి దగ్గర్నుంచి?"

"ఏమో... దస్తూరీ కొత్తగా వుంది. పైగా కర్నూల్లో మనకెవరున్నారని, మీ స్నేహితులెవరన్నానేమో. అందుకనే తెరచి చూడలేదు" అంది ప్రక్కనే కూర్చుంటూ.

"ఆహా" అంటూ కవరు చింపి ఉత్తరం చదివాడాయన.

ఆయన గుండె తరుక్కుపోయింది.

ఇరవై ఏళ్ళనాటి సంఘటన -

మరుగునపడిన జ్ఞాపకం ఆయన మనసుకి పని కల్పించింది.

ఆ జ్ఞాపకాల పొరలని తప్పించుకుంటూ ఆయన మళ్లీ ఉత్తరం తీసి చదివారు.



ఘాటైన వంటకాలు తిన్నపుడు నోరు వాసన వస్తూంటే నాలుగు తమలపాకులు నమలండి. వాసన పోతుంది.

***

ఉప్పుకలిపిన నీటిలో గంట సేపు ఎండిన కేరట్ లను వుంచితే తాజాగా అవుతాయి.

అల్ల లక్ష్మీప్రియ

అక్షరాల వెంట పరుగులు తీస్తున్న ఆయన కళ్లు అక్కడికి వచ్చేసరికి నీటి కుండలయ్యాయి.

"మా నాన్న పోవడంతో నా పెళ్లి సంగీతం నాకు అక్కరకొచ్చింది. తమ్ముడికి చదువునిచ్చింది. రెక్కలొచ్చిన పక్షిలా తమ్ముడు వేరే గూటిని వెతుక్కుంటూ వెళ్ళిపోయాడు. కోపం రాలేదు నాకు మరి. అదంటే ఏమిటో తెలీకుండా పెంచాడు కదా మా నాన్న. సరే ఇది అప్రస్తుతం. మా అమ్మని వృద్ధాప్యం కబళించగా నేను ఒంటరినయ్యాను.

యవ్వనంలో వసంతంలా కాకుండా నడి సముద్రంలో నావలా ఒంటరితనం నన్ను ఉక్కిరి బిక్కిరి చేసింది.

అదిగో సరిగ్గా అప్పుడు ఆనాటి వెన్నెల రాత్రి... ఆ సంఘటన... ఆ జ్ఞాపకం... పిల్లతెమ్మెరలా వచ్చి నాలోని స్త్రీత్వానికి జీవం పోసింది.

ఎప్పుడది తలపుకొచ్చినా -

ఆ తలపుతో... వెన్నెల వెలుగు... నా కళ్ళలోకి... జీవచైతన్య జ్యోతిలా తరలించుకుంటూ రెప్పలు అర్పడంలో... రోజులు... నెలలు... ఏళ్లూ...

గడచిన ఏళ్ళని కాలం ఒడిలోకి జేర్చి నువ్వు నాతోరా అంటోంది రాచపుండు. ఆరిపోయే దీపపు కాంతిలా ఈ రాచశబ్దం తాలూకు తీవి ఇప్పుడు నాలో కావలసినంత.

ఈ శబ్దంతో నామైత్రి మూడు మొగ్గలూ ఆరు పువ్వులూగా విలసిల్లుతోంది. పువ్వులెప్పుడూ రాలిపోతాయిగా.

ఎప్పుడో నేనూ...
రేకు రెప్పల
కలల కంటూ కలవరిస్తూ
కలత నిద్రలోనే
యెప్పుడో
కళ్లు మూస్తాను.

నాకున్న ఆస్తీ పాస్తీ - ఒక హార్మోనీ పెట్టె, ఒక చిన్న పూరి పాకానూ. ఈ వ్యర్థ జ్ఞాపికలు రెండూ మీకే నైవేద్యం.

శలవా మరి.

ఎవరికీ
ఏమీకాని
అభాగ్యురాలు

ఆ ఉత్తరాన్ని చదవమంటూ భార్యకిచ్చాడు. ఆమె కూడా చదివింది.

ఆరోజు పెట్టిన చెంప పెట్టు కంటే కూడా ఎక్కువగా ఈ ఉత్తరం బాధిస్తోందేం... చెప్మా అంటూ "మగవాడి మరుగుజ్జుతనాన్ని అసహ్యించుకోదేం ఆడది" అని అన్నాడు అపాత్ర దానం... అపాత్ర దానం... అంటూ సణిగాడు.

"హాయిగా పెళ్ళి చేసుకోక ఒంటరిగా వుండిపోయిందేవిటండీ. ఒత్తి అమాయకురాల్లా ఉంది."

భార్య అజ్ఞానానికి జాలిపడ్డాడాయన.

పెద్ద మొత్తాల్లో కాకపోయినా -

అథమం స్కూటర్లూ, టీవీలూ ఇచ్చి, తిట్లు తిని, కాళ్లూ కడుపూ పట్టుకు బతిమిలాడి తీసుకొస్తేనే గానీ ఆడపిల్లతో జీవితానికి ఏ మగాడూ ఒప్పుకోడు.

అంచేత ఈ అమ్మాయి ఈ దేశంలో సగటు ఆడదానిలా పురుషుడితో జీవనం సాగించకుండా హార్మోనీ పెట్టెతో జీవనం సాగించింది. ఇదే విషయాన్ని భార్య తలకెక్కించాడు. మరుక్షణానికి ఆమె కళ్లు నీటి చెలమలయ్యాయి.

వారా ఉత్తరాన్ని ఎన్నిసార్లు చదివారో... చదివిన కొద్దీ గుండె భారం పెరుగుతోందే కానీ తరగట్లేదు.

చెంపపెట్టే నయం... చెంపపెట్టే నయం అనుకుంటూ, కుర్చీలోంచి లేస్తూ సత్తువ కోసం చేతిని... భార్యవైపుకు చాపాడు.

చేతిని అందుకొని, పసివాడిలాగా పాదివి పట్టుకుని మెల్లిగా మంచం వైపుకు నడిపించుకుంటూ వెళ్ళింది. ఆయన కనుకొలుకుల్లో నివాసం వున్న... నీటి బిందువులు తొణికి ఆమె గాజుల చేతిపై ముత్యాల్లా పేరుకొంటున్నాయి.

"మన బుజ్జిగాడెంత మారాం చేసినా విసుక్కోదేం పాపాయి?" అన్న భర్త అసందర్భపు ప్రశ్నకి క్షణం విస్తుబోయినా ఆయన ఆలోచనలని అర్థం చేసుకొన్న ఆమె అతడి తడి ఆరని కళ్ళపై పెదాలు అన్చింది. భార్యకు దగ్గరగా జరిగాడాయన.

నులి మంచు తెరలు చందమామను కమ్మేస్తున్నాయి. ❋